# ప్రేమాభిమాని సేయింట్ వాలంటైన్

ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన "వాలంటైన్స్ వారోత్సవాలు" ప్రతి ఏట ఫిబ్రవరి 07 నుంచి 14 వరకు నిర్వహించడంతో పాటు చివరి రోజు 14 ఫిబ్రవరిన "వాలంటైన్స్ దినం" లేదా "ప్రేమికుల దినం"గా కూడా పెద్ద ఎత్తున పాటించడం నేటి డిజిటల్ యువతకు అలవాటుగా మారింది. "ప్రేమ", "ఆప్యాయత"లే అమూల్య ఇంధనాలుగా ప్రపంచ మానవాళి శాంతియుతంగా గడుపుతున్నది. శిశువుకు తొలి "ప్రేమ"ను పరిచయం చేస్తుంది అమ్మ. చిరునవ్వుల శిశువు నాన్న "ఆప్యాయత"ను రుచి చూస్తుంది. అమ్మనాన్నలతో ప్రారంభమైన "ప్రేమానురాగాలు", అనంత "ఆప్యాయత"లు క్రమంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వరకు విస్తరించి జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. ప్రేమ నిండిన హృదయాల్లో ద్వేషానికి తావు లేదు. ప్రేమానురాగాల రుచి చూడలేని అభాగ్యుల జీవితాలు గాఢాంధకారంలోనే ముగుస్తాయి. మానవ సంబంధాలతో మొదలైన "ప్రేమలు" చెట్లు, పువ్వులు, పెంపుడు జంతువులు, ఆట వస్తువులు, పుస్తకాలు లాంటి

**(14 ఫిబ్రవరి "వాలంటైన్స్ దినం" సందర్భంగా)**

వాటి వరకు విస్తరించి వ్యక్తి జీవితంలో రంగుల సింగడిలను రుచి చూపిస్తాయి. కౌమార దశలో అబ్బాయికి అమ్మాయిని చూసినా, అమ్మాయి అబ్బాయిని చూసినా ఏదో తెలియని వ్యతిరేక ధృవాల ఆకర్షణ ప్రేమ పేరుతో ప్రారంభమవుతుంది.

## 14 ఫిబ్రవరి – వాలంటైన్స్ లేదా ప్రేమికుల దినం :

రోమన్ కాథలిక్ చర్చ్‌కు చెందిన సేయింట్ వాలంటైన్ చొరవతో యువ ప్రేమికులను ఏకం చేయడం, ప్రేమకు పట్టాభిషేకం చేయడాని తన ప్రాణాలను సహితం అర్పించడం జరిగింది. ఈ రోజున యువ జంట ఒకరినొకరు మనసు విప్పి తమ ప్రేమానురాగాలను, అప్యాయతలనుధైర్యంగా వ్యక్తం చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తారు.

రోమన్ యువ సైనికులు పెళ్లిళ్లు చేసుకోవడాన్ని నిషేధించారు నాటి రోమన్ చక్రవర్తి క్లాడియస్–2. చక్రవర్తి విధించినా వివాహ నిషేధాజ్ఞలను బేఖాతరు చేస్తూ ప్రేమకు పట్టం కట్టడానికి పూనుకొన్న సేయింట్ వాలంటైన్ ఆ యువ జంటలను ఏకం చేస్తూ పెళ్లి పీటల వరకు తీసుకురావడం జరిగింది. తన నిషేధాజ్ఞలకు విరుద్ధంగా యువ సైనికులకు వివాహాలు చేసిన సేయింట్ వాలంటీన్‌కు క్రీ. శ. 14 ఫిబ్రవరి 269న మరణ శిక్ష విధించడంతో సేయింట్ వాలంటీన్ అమరత్వం పొందారు. తన ప్రాణాలకు తెగించి ప్రేమికులను ఏకం చేయడానికి కృషి చేసిన సేయింట్ వాలంటీన్ వర్ధంతి 14 ఫిబ్రవరి రోజున "వాలంటీన్స్ లేదా ప్రేమికుల దినం" నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

## ప్రేమలు మూడుముళ్ల బంధంగా మారాలి:

భారతీయ సంస్కృతిలో ఇలాంటి పాశ్చాత్య పోకడలకు ఆదరణ తక్కువ. పాశ్చాత్య దేశాల యువతలో తల్లితండ్రులకు తెలియకుండా ఇలాంటి ప్రేమలు వ్యక్తం చేసుకోవడం ప్రేమికులకు సర్వసాధారణం.

కొన్ని సందర్భాల్లో యువ ప్రేమికుల జంట కొంత సమయం ఉభయుల అంగీకారంతో తర్వాత విడిపోవడం కూడా సులభంగా జరుగుతుంది.

సనాతన భారతంలో ప్రేమించుకున్న యువతీయువకులు రోడ్లు, పార్కులు, పబ్బుల్లో తమ ప్రేమలను వ్యక్తం చేసుకోకుండా ఒక పద్దతిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహాలు నిశ్చయం చేసుకొని మంగళ సూత్రాల మూడు ముళ్లు పడిన అనంతరం మాత్రమే ఆలింగనాలు, ముద్దుల వర్షాలు లాంటి శారీరక స్పర్శలకు అనుమతి ఇవ్వబడుతుంది. అయినప్పటికీ నేటి ఆధునిక డిజిటల్ భారతీయ యువత ప్రేమకు, కామానికి తేడా తెలియకుండానే క్షణాల్లో ప్రేమించుకోవడం, ఆలింగన ముద్దుల హద్దులు దాటడం, అన్ని రకాల శారీరక సుఖాలను అనుభవించడం, అటు పిమ్మట వాయు వేగంగా విడిపోవడం కూడా చూస్తున్నాం.

తల్లితండ్రులు కుదిర్చిన అరేంజ్డ్ మ్యారేజీలు కాని ప్రేమ వివాహాలు కాని ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే యువ ప్రేమికుల జంట వివాహ బంధంతో ఏకం కావాలని, తమ వైవాహిక జీవితాన్ని కడదాక ఆసాంతం ఆస్వాదించాలని, ఆదర్శ జంటగా ఆనంద హరివిల్లుల కుటుంబ జీవనం గడపాలని కోరుకుందాం. కామ ఆకర్షణకు, అంతరంగిక ప్రేమకు తేడాను అర్థం చేసుకొని సన్మార్గంలో తమ జీవితాలను కొనసాగించాలని మార్గనిర్దేశనం చేద్దాం.

మూడుముళ్ల బంధాలు మూడు రోజుల్లో విడిపోకుండా, విడాకులే కానరాని యువ భారతాన్ని కనులారా చూసి తరిద్దాం.



–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పారిస్ ఏఐ కార్యాచరణ సదస్సుకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ సహాధ్యక్షత

## ఏఐ ఈ శతాబ్దపు మానవీయతను రచిస్తోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:పారిస్ లో జరిగిన కృత్రిమ మేధ కార్యాచరణ సదస్సుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు శ్రీ ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో కలిసి భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సహాధ్యక్షత వహించారు. వారం పాటు సాగిన సదస్సు ఈనెల 6–7 తేదీల్లో సైన్స్ దినోత్సవాలతో ప్రారంభమైంది. తర్వాతి రెండు రోజులు సాంస్కృతిక వారాంతపు కార్యక్రమాలు నిర్వహించారు. ఉన్నత స్థాయి ముగింపు కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో ఈ రంగానికి నేతృత్వం వహిస్తున్న ప్రముఖులు, విధాన నిర్ణేతలు, నిపుణులు హాజరయ్యారు.

ఫిబ్రవరి 10న ఎలిసీ ప్యాలెస్ లో అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇచ్చిన విందుతో ఈ ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. దేశాధినేతలు, అంతర్జాతీయ సంస్థల నాయకులు, ప్రధాన ఏఐ కంపెనీల సీఈవోలు, ఇతర విశిష్ట అతిథులంతా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేటి సదస్సులో సహాధ్యక్షుడిగా ప్రారంభోపన్యాసం చేయాల్సిందిగా భారత ప్రధానమంత్రిని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఆహ్వానించారు. మానవీయతా కోడింగ్ ను వేగంగా లిఖిస్తూ.. మన రాజకీయ, ఆర్థిక, భద్రత వ్యవస్థలతోపాటు సమాజ రూపురేఖలను కృత్రిమమేధ మార్చివేస్తోందని, ప్రస్తుతం ఈ ఉషోదయం వాకిట ప్రపంచం నిలిచి ఉందని ప్రధానమంత్రి తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. ప్రభావం దృష్ట్యా.. మానవ చరిత్రలో సాధించిన ఇతర సాంకేతికతలతో పోలిస్తే ఏఐ భిన్నమైనదన్నారు. ఉమ్మడి విలువలను కాపాడుకునే, సంకట స్థితిని పరిష్కరించి విశ్వాసాన్ని నింపే విధానాలు, ప్రమాణాలను నెలకొల్పే దిశగా అంతర్జాతీయ స్థాయిలో సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. విధానమంటే కేవలం సంకట పరిస్థితులను ఎదుర్కోవడం మాత్రమే కాదని, ఆవిష్కరణలను ప్రోత్సహించి అంతర్జాతీయ శ్రేయస్సు కోసం వాటికి విస్తృత వ్యాప్తి కల్పించాలని అన్నారు. ఈ దిశగా ఏఐని అందరికీ.. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించి, ప్రజా కేంద్రీకృత అప్లికేషన్ల ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సౌర కూటమి వంటి కార్యక్రమాల ద్వారా భారత్ – ఫ్రాన్స్ మధ్య విజయవంతమైన సుస్థిర భాగస్వామ్యాన్ని ప్రస్తావిస్తూ.. ఆధునిక, బాధ్యతాయుతమైన భవిత దిశగా ఉమ్మడి ఆవిష్కరణల కోసం ఇరుదేశాలూ చేతులు కలపడం సహజమేనని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

సార్వత్రికమైన, అందుబాటులో ఉండే సాంకేతికత ఆధారంగా 140 కోట్ల మంది ప్రజల కోసం డిజిటల్ ఆధారిత ప్రజా మౌలిక సదుపాయాలను భారత్ విజయవంతంగా నిర్మించిందని ప్రధానమంత్రి ప్రస్తావించారు. భారత ఏఐ మిషన్ ను గురించి వివరిస్తూ.. వైవిధ్యం దృష్ట్యా ఏఐ కోసం స్వీయ విస్తృత భాషా వైవిధ్య నమూనాను భారత్ రూపొందిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఏఐ ప్రయోజనాలు అందరికీ అందడం కోసం తన అనుభవాలను పంచుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. తర్వాత జరగబోయే ఏఐ సదస్సుకు భారత్ ఆతిథ్యమిస్తుందని ప్రధానమంత్రి ప్రకటించారు. ప్రధానమంత్రి పూర్తి ప్రసంగాన్ని ఇక్కడ చూడొచ్చు: ఖిజూవనితినిణ ంటటతీవబబ ; అనీనిఇ-శ్రీబీటతినిణ ంటటతీవబబ రి

నాయకుల ప్రకటనను ఆమోదించడంతో సదస్సు ముగిసింది. సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించేలా ఏఐ మౌలిక సదుపాయాలను అందరికీ మరింతగా అందుబాటులోకి తేవడం, ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం, ప్రజా ప్రయోజనం కోసం ఏఐ, ఏఐని మరింత సుస్థిరంగా మార్చడం, సురక్షిత – విశ్వసనీయ ఏఐ విధానాలు సహా పలు కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించారు.

# ఎస్తోనియా అధ్యక్షుడితో ప్రధానమంత్రి భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:ప్యారిస్ 'ఏఐ ఏక్షన్ సమిట్' నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ఎస్తోనియా దేశాధ్యక్షుడు శ్రీ అలార్ కరిస్ తో భేటీ అయ్యారు, ఇది ఇరువురు నేతల తొలి సమావేశం.

భారత్, ఎస్తోనియా ల మధ్య నెలకొన్న స్నేహపూర్వక సంబంధాలు ప్రజాస్వామ్యం, న్యాయపాలన, స్వాతంత్ర్యం, సామ్యవాదం వంటి ఆదర్శాల ప్రాతిపదికగా ఏర్పడిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఐటీ, డిజిటల్, సాంస్కృతిక సంబంధాలు, పర్యాటకం, ఇరుదేశాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలు సహా ద్వైపాక్షిక సంబంధాలు వృద్ధి చెందడం పట్ల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. సైబర్ భద్రత అంశంలో ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న పరస్పర సహకారాన్ని గురించి నేతలు చర్చించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్ లో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలంటూ ఎస్తోనియా ప్రభుత్వాన్నీ కంపెనీలనూ శ్రీ మోదీ ఆహ్వానించారు.

భారత్, ఎస్తోనియా ల పరస్పర సంబంధాలు విలువైనవని, ముఖ్యంగా భారత్ ? ఈయూ (యూరోపియన్ యూనియన్) భాగస్వామ్యం నేపథ్యంలో ఇరుదేశాల భాగస్వామ్యం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుందని నేతలిద్దరూ అభిప్రాయపడ్డారు. భారత్–నార్డిక్–బాల్టిక్ దేశాల మధ్య మంత్రుల స్థాయి రాకపోకల ప్రారంభం స్వాగతించదగ్గ పరిణామమని సంతోషం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలను చర్చించిన నాయకులు, ఐక్య రాజ్య సమితిలో సహకారం అవసరమని అంగీకరించారు.

భారత్, ఎస్తోనియా ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు సహా ఇరుదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాల బలోపేతం పట్ల ఇద్దరు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్తోనియాలో యోగాకి పెరుగుతున్న ఆదరణ పట్ల ప్రధానమంత్రి సంతోషాన్ని వెలిబుచ్చారు.

# 19న సిఇసి, ఇసి నియామకాలపై పిటిషన్ల విచారణ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : 2023 చట్టం కింద ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ల (ఇసిల) నియామకాలను సవాల్ చేస్తున్న పిటిషన్లను ఈ నెల 19న విచారిస్తామని సుప్రీం కోర్టు బుధవారం ప్రకటించింది. ఈ లోగా ఏమైనా సంభవిస్తే పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఆ పిటిషన్లను బుధవారం విచారిస్తామని ఇంతకుముందు ప్రకటించారని, కానీ వాటిని 19న విచారణ జాబితాలో చేర్చారని ఎన్‌జిఒ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఎడిఆర్) తరపున హాజరవుతున్న న్యాయవాదిప్రశాంత్ భూషణ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనంతో చెప్పారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ 18న రిటైర్ కానున్నారని, తాము సవాల్ చేసిన 2023 చట్టం కింద కొత్త సిఇసిని ప్రభుత్వం నియమించవచ్చునని, కనుక ఈ కేసును అత్యవసరంగా విచారించవలసి ఉందని ప్రశాంత్ భూషణ్ వాదించారు.'మేము ఈ కేసు విచారణను 19కి నిర్ధారిస్తున్నాం. ఈలోగా ఏమైనా సంభవిస్తే పరిణామాలు తప్పవు' అని బెంచ్ స్పష్టం చేసింది. జస్టిస్ కాంత్ అస్వస్థతతో ఉన్నందున కేసుల విచారణను 19న నిర్ధారిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం రిజిస్ట్రీ తమకు తెలియజేసిందని ఎన్‌జిఒ తరపున హాజరవుతున్న ప్రశాంత్ భూషణ్ చెప్పారు.ఇక అన్ని వ్యవహారాలను 19న విచారణకు చేపడతామని జస్టిస్ కాంత్ తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 3న ఈ కేసు విచారణను బుధవారానికి (12కు) నిర్ణయిస్తూ యోగ్యత ప్రాతిపదికను అంతిమంగా కేసును తేలుస్తామని స్పష్టం చేసింది.ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)తో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారా నియామకానికి ఇసిలను ఎంపిక చేయవలసి ఉంటుందని 2023 నాటి తీర్పు స్పష్టం చేసిందని భూషణ్ అంతకుముందు చెప్పారు. 'వారు ఒక చట్టం తెచ్చారు. దాని కింద ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, మరొక మంత్రిని తీసుకువచ్చారు, ఆ విధంగా కమిషనర్ల నియామకం ప్రభుత్వం సంతుష్టి మేరకే జరుగుతుందన్న మాట. ఎన్నికల కమిషనర్ల నియామకానికి స్వతంత్ర కమిటీ ఉండడం అవసరం' అని భూషణ్ బెంచ్‌తో చెప్పారు. 2023 మార్చి 2 నాటి రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకారమే సిఇసి నియామకం జరపాలని కేంద్రాన్ని ఆదేశించవలసిందని కోరుతూ తాము ఒక అర్జీ దాఖలు చేశామని పిటిషనర్ కాంగ్రెస్‌కు చెందిన జయ ఠాకూర్ తరపున హాజరవుతున్న న్యాయవాది వరుణ్ ఠాకూర్ అంతకుముందు బెంచ్‌కు తెలిపారు.

# కుమారస్వామిని దర్శించుకున్న పవన్ కల్యాణ్

**-కుంభకోణం ఆలయంలో పవన్ కల్యాణ్స్వామిమలై క్షేత్రంలో పూజలు**

**-కుమారుడు అకీరానందన్ తో కలిసి శ్రీ స్వామినాథ స్వామి దర్శనం**

**-కొనసాగుతున్న షష్ట షణ్ముఖ క్షేత్ర యాత్ర**



అమరావతి, ఫిబ్రవరి 13: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధ్యాత్మిక పర్యటన కొనసాగుతోంది. ప్రస్తుతం ఆయన తమిళనాడు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా గురువారం ఉదయం షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవ క్షేత్రం స్వామిమలై ఆలయాన్నితన కుమారుడు అకీరా నందన్‌తో సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు కన్నన్ గురుకల్.. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.. పంచ హారతులిచ్చారు.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్థంభానికి మొక్కారు పవన్ కల్యాణ్. కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు..

స్వామినాథ స్వామి దర్శనానంతరం ఆలయంలో వెలసిన ఆదిదంపతులు సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి డిప్యూటీ కమిషనర్ ఉమా దేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ ఆనంద్ సాయి ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు..

# ఆదిత్యుని సన్నిధిలో నందమూరి రామకృష్ణ



శ్రీకాకుళం, ఫిబ్రవరి 13 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు వేదమంత్రాలతో మంగళ వాయిద్యాలతో శాసనసభ్యులు గొండు శంకర్ ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రత్యేకతను ఆలయ విశిష్టతను తెలిపారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామి ప్రత్యక్షంగా ప్రత్యేక పూజలు అందుకోవడంలో ఏకైక దేవాలయంగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయమని, ఈ దేవాలయానికి ఏడాది పొడుగునా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని, అందులో భాగంగా మాఘ పౌర్ణమి పూజలు విశేషంగా జరుగుతాయని అన్నారు. అనంతరం అనివెట్టి మండపంలో వేద పండితులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలి

**- పార్టీ శ్రేణులకు జగన్ మోహన్ రెడ్డి పిలుపు**

అమరావతి ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపి ప్రభుత్వం మీద వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతోందని వైఎస్ఆర్ సిపి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాడేవల్లి సీనియర్ నేతలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగించారు. సిఎం చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల హామిల్లో ఏవీ నెరవేర్చడం లేదని దుయ్యబ ట్టారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత రోజు రోజుకీ తీవ్రమవుతోందని జగన్ తెలియజేశారు. సూపర్ సిక్స్ హామిల అమలుపై చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శలు గుప్పించారు.

అందుకే ఏవేవో సాకులు చెబుతూ?అవి ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. చంద్రబాబు వంచన, దారుణ మోసాలను.. మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందుకోసం రోజూ ప్రజల్లో ఉండాలని, ప్రజలతో మరింత మమేకం కావాలని జగన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎలు, ఎంపిలు, జడ్పిటిసిలు, మున్సిపల్ ఛైర్ పర్సన్లు, వైసిపి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# భారత ఇంధన వారోత్సవాల (ఎనర్జీ వీక్) సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:గౌరవ కేంద్ర మంత్రివర్గ సభ్యులు, మాన్యులు, రాయబారులు, వివిధ సంస్థల సీఈఓలు, గౌరవ అతిథులు, ఇతర ప్రముఖులు, సోదర సోదరీమణులారా,

భారత ఇంధన వారోత్సవాల (ఎనర్జీ వీక్) సందర్భంగా దేశ, ప్రపంచ నలుమూలల నుంచి యశోభూమికి తరలివచ్చిన మీ అందరికీ నమస్కారాలు! మీరు ఈ ఇంధన వార్షికోత్సవానికే కాదు, భారత ఇంధన లక్ష్యాల్లోనూ భాగస్వాములు. మీ అందరికీ, అలాగే విదేశాల నుంచి విచ్చేసిన అతిథులందరికీ నేను హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను.

21వ శతాబ్దం భారత్‌దేనని నేడు ప్రపంచ నిపుణులంతా చెబుతున్నారు. భారత్ తన సొంత వృద్ధిని మాత్రమే కాకుండా.. ప్రపంచ వృద్ధి రేటును కూడా నడిపిస్తోంది. మన ఇంధన రంగం ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తోంది. భారత్ ఇంధన లక్ష్యాలు ఐదు మూల స్తంభాలపై ఆధారపడి ఉన్నాయి: వీటిలో మొదటిది మనం ఉపయోగించుకుంటున్న మన వనరులు, రెండోది ఆవిష్కరణల దిశగా ప్రోత్సాహం అందుకుంటున్న మన మేధోసంపత్తి, మూడోది మనం కలిగి ఉన్న ఆర్థిక బలం, రాజకీయ స్థిరత్వం, అలాగే నాల్గోది భారత్ వ్యూహాత్మక భౌగోళిక అనుకూలతలు ఇంధన వాణిజ్యాన్ని మరింత ఆకర్షణీయం, సులభతరం చేయడం. ఐదోది, ప్రపంచ సుస్థిరత విషయంలో భారత్ నిబద్ధత. ఈ ఐదు అంశాలు భారత ఇంధన రంగంలో కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి.

'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) సాధనలో రాబోయే రెండు దశాబ్దాలు చాలా కీలకమైనవి. రాబోయే ఐదేళ్లలో మనం అనేక ముఖ్యమైన మైలురాళ్లు దాటబోతున్నాం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడం, భారత రైల్వేలు నికర జీరో కర్బన ఉద్గార లక్ష్యాన్ని చేరుకోవడం, ఏటా ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడం వంటి లక్ష్యాలు మనం నిర్దేశించుకున్నాం. ఈ లక్ష్యాలు ప్రతిష్టాత్మకంగా అనిపించినా, గత దశాబ్దంలో సాధించిన విజయాలు మనం వాటిని సాధిస్తామనే విశ్వాసాన్ని ఇస్తున్నాయి.

గత పదేళ్లలో, భారత్ పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చెందింది. ఈ కాలంలో, మన సౌరశక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని 32 రెట్లు పెంచుకున్నాం. నేడు, సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ ప్రపంచం లోనే మూడో అతిపెద్ద దేశంగా నిలిచింది. మన శిలాజేతర ఇంధన సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. పారిస్ ఒప్పందం లక్ష్యాలను అనుకున్న దానికంటే ముందుగానే చేరుకున్న మొదటి జీ20 దేశంగా భారత్ నిలిచింది. మనం మన లక్ష్యాలను త్వరగా చేరుకోగలమని నమ్మకంగా చెప్పడానికి ఒక ఉదాహరణ ఇథనాల్ మిశ్రమం. భారతదేశం ప్రస్తుతం 19 శాతం ఇథనాల్ మిశ్రమం వినియోగిస్తోంది, దీని ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతోంది, రైతుల ఆదాయం గణనీయంగా పెరగడం, కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు గణనీయంగా తగ్గడం కూడా సాధ్యమైంది. 2025 అక్టోబర్‌కి ముందే 20 శాతం ఇథనాల్ మిశ్రమం తప్పనిసరి చేసే దిశగా మేం పురోగమిస్తున్నాం. భారత్ బయోఫ్యూయల్స్ పరిశ్రమ వేగవంతమైన వృద్ధికి సిద్ధంగా ఉంది. మనకు 500 మిలియన్ మెట్రిక్ టన్నుల స్థిరమైన ఫీడ్‌స్టాక్ సామర్థ్యం ఉంది. భారత్ జీ20 అధ్యక్షత కాలంలో, గ్లోబల్ బయోఫ్యూయల్స్ అలయన్స్ ఏర్పడి, క్రమంగా విస్తరిస్తూనే ఉంది, 28 దేశాలు, 12 అంతర్జాతీయ సంస్థలు దీనిలో చేరాయి. దీని ద్వారా వ్యర్థాలను సంపదగా మార్చడం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు జరుగుతోంది.

భారత్ తన హైడ్రోకార్బన్ వనరుల సామర్థ్యాన్ని పూర్తిగా అన్వేషించడానికి నిరంతర సంస్కరణలను అమలు చేస్తోంది. ప్రధాన ఆవిష్కరణలు, గ్యాస్ మౌలిక సదుపాయాల విస్తృత విస్తరణ కారణంగా, మన గ్యాస్ రంగం విస్తరిస్తోంది.

# వేవ్స్ 2025 "రీల్ మేకింగ్" చాలెంజ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:వేవ్స్ 2025 'రీల్ మేకింగ్' చాలెంజ్ ఒక విశిష్టమైన పోటీ. ఇది సృజనాత్మక కళాకారులకు, ఔత్సాహిక కళాకారులకు వారిలోని కథచెప్పే నైపుణ్యాల్ని మెటా ఉపకరణాలను ఉపయోగించుకొంటూ 30–90 సెకన్ల ఫిల్మ్ ఫార్మేట్‌లో ప్రదర్శించేందుకు వీలు కల్పిస్తుంది. సమాచార, ప్రసార శాఖ సహకారంతో ది ఇంటర్‌నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ నిర్వహించే ఈ చాలెంజ్‌కు ఘనమైన స్పందన లభించింది. 2025 ఫిబ్రవరి 5 నాటికి భారత్ నలుమూలల నుంచి, 20 ఇతర దేశాల నుంచి 3,379 నమోదులు పూర్తయ్యాయి. ఇది డిజిటల్ రూపకర్తలకు ప్రయోగాలు చేయడానికీ, నూతన ఆవిష్కరణలతోపాటు షార్ట్ ఫార్మ్ కంటెంట్ పరిధులను విస్తరించడానికి కూడా ఒక వేదికను అందిస్తుంది.

ఈ చాలెంజ్ 'క్రియేట్ ఇన్ ఇండియా' పోటీల్లో ఒక భాగం. క్రియేట్ ఇన్ ఇండియా పోటీలు అనేది వరల్డ్ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ పర్యవేక్షణలో అమలుచేస్తున్న ఒక ప్రధాన కార్యక్రమం. దీనిని 2025 మే 1 నుంచి 4 వరకు ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లోను, జియో వరల్డ్ గార్డెన్స్‌లోను నిర్వహించనున్నారు. వేవ్స్ మీడియా, వినోద (ఎం అండ్ ఈ) పరిశ్రమలో చర్చలు, సహకారం, నవకల్పనలను ప్రోత్సహించే అగ్రగామి ప్రపంచ వేదికగా ఉంది. ఈ శిఖరాగ్ర సమావేశం పరిశ్రమ రంగ ప్రముఖులను, ఆసక్తిదారులను ఒక చోటుకు తీసుకు వచ్చి, కొత్తగా ఎలాంటి ఎలాంటి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయో అన్వేషించడంతోపాటు సవాళ్లను పరిష్కరించడానికీ, ప్రపంచంలో ఒక సృజనప్రధాన కూడలిగా భారత్ స్థానాన్ని పటిష్టపరచడానికీ తోడ్పడనుంది. 31 పోటీలలో 70,000కు పైచిలుకు నమోదులతో, క్రియేట్ ఇన్ ఇండియా పోటీలు సృజనాత్మకతనూ, ప్రతిభనూ, అంతర్జాతీయ సహకారాన్నీ ప్రోత్సహించనుంది.

వేవ్స్ 2025లో భాగంగా ఒక కీలక కార్యక్రమంలా మొదలుపెట్టిన 'రీల్ మేకింగ్' సవాలు మీడియా, వినోద రంగాల్లో ఓ ప్రపంచ కూడలిగా భారత్ తెర మీదకు వస్తోందని సూచిస్తోంది. అదే కాలంలో, డిజిటల్ రూపకర్తలు వారి వంతుగా ప్రధాన పాత్రను పోషిస్తున్న నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ముందుకు సాగుతుండడాన్ని తెలియజేస్తోంది. ఇది భారత్ ప్రభుత్వ 'క్రియేట్ ఇన్ ఇండియా' దృష్టికోణానికి సైతం అనుగుణంగా ఉంటూ దేశవ్యాప్తంగానూ, దేశం వెలుపలా కూడా ప్రతిభావంతులకు దన్నుగా నిలుస్తోంది.

ఈ సవాలు అఫ్గానిస్తాన్, అల్జీరియా, అమెరికా, అండోరా, ఎంటగువా– బార్‌బుడా, బంగ్లాదేశ్, యూఏఈ, ఆస్ట్రేలియా, జర్మనీలు సహా అనేక దేశాల వారిని ఆకర్షించింది. ఇది సృజనాత్మక రంగంలో భారత్ ప్రభావం నానాటికీ విస్తరిస్తూ ఉండడాన్ని, ప్రపంచమంతటా కంటెంట్‌ను రూపొందించే వారికి ఒక ప్రముఖ వేదికగా వేవ్స్‌కు ఆదరణ అధికం కావడాన్ని చాటిచెబుతోంది.

దేశీయంగా చూస్తే, ఈ పోటీకి ఎంట్రీలు తవాంగ్ (అరుణాచల్ ప్రదేశ్), దీమాపుర్ (నాగాలాండ్), కార్గిల్ (లద్దాఖ్), లేహ్, శోపియాన్ (కాశ్మీర్), పోర్ట్ బ్లేయర్ (అండమాన్, నికోబార్ దీవులు), తెలియామురా (త్రిపుర), కాసరగోడ్ (కేరళ)లతోపాటు గంగ్‌టోక్ (సిక్కిం) .. ఇలా దేశ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాల నుంచి, మారుమూల ప్రాంతాల నుంచి కూడా వచ్చాయి. చిన్న చిన్న పట్టణాలు, ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న సృజనాత్మక కేంద్రాల నుంచి లభించిన బలమైన ప్రతిస్పందన మన దేశంలో సమృద్ధంగా ఉన్న కథన సంప్రదాయాలతోపాటు వర్ధిల్లుతూ ఉన్న డిజిటల్ అనుబంధ విస్తారిత వ్యవస్థకు అద్దం పడుతున్నాయి.వయసు కనీసం 20 ఏళ్లున్న పోటీదారులు 'వికసిత్ భారత్' వంటి ఇతివృత్తాలపై రీల్స్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. వాటిలో మన దేశం సాంకేతికంగాను, మౌలిక సదుపాయాల కల్పన పరంగాను సాధించిన పురోగతిని ప్రధానంగా వివరించాలి. అలాగే, ఎనిటతిజీ ఏ 2047," (2047కల్లా భారత్) అనే అంశాన్ని కూడా తీసుకోవచ్చు.

# గాజాను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు..స్వాధీనం చేసుకుంటాం

వాషింగ్టన్ ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గాజాను స్వాధీనం చేసుకొని, తిరిగి నిర్మిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 తో భేటీ అయిన ట్రంప్ , ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. దాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదంటూ వ్యాఖ్యానించారు. 'మేము గాజాను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.

దాన్ని స్వాధీనం చేసుకుంటాం. గాజాను రక్షించి పునరుద్ధరిస్తాం. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆలోచన నాకు లేదు. మధ్య ప్రాచ్యం లోని ప్రజలకు అనేక ఉద్యోగాలు సృష్టించనున్నాం' అని ట్రంప్ ఓవెల్ కార్యాలయంలో విలేకరులతో తెలిపారు.

2 వేల మంది పిల్లలను తీసుకుంటాం..

యుద్ధం కారణంగా అనారోగ్యం తో , క్యాన్సర్‌తో బాధపడుతున్న 2 వేల మంది చిన్నారులను తమ దేశానికి తీసుకువెళతామని అబ్దుల్లా 2 ప్రకటించారు. దీనిని ట్రంప్ అద్భుతమైన విషయంగా పేర్కొన్నారు. అయితే , నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించాలనే ప్రతిపాదనను మాత్రం జోర్డాన్ రాజు తిప్పి కొట్టారు. వారిని అక్కడి నుంచి పంపించకుండా గాజాను తిరిగి నిర్మించాలన్నారు. ట్రంప్ ప్రతిపాదనపై అరబ్ దేశాలు రియాద్‌లో చర్చిస్తాయన్నారు. అమెరికా గాజాను స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను గత వారం తొలిసారి ట్రంప్ బయటపెట్టాం ీ.నాడు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తో భేటీ తరువాత ఆయన ఈ ప్రకటన చేశారు. దానిని స్వాధీనం చేసుకొని ఓ వెకేషన్ ప్రదేశంగా (రివేర) అభివృద్ధి చేస్తామని వ్యాఖ్యానించారు. నాడు నెతన్యాహు కూడా దీనిని ఓ విప్లవాత్మక ఆలోచనగా అభివర్ణించారు. హమాస్ మాత్రం ట్రంప్ ఆలోచనలను తీవ్రంగా తప్పు పట్టింది. పాలస్తీనాలో గాజా విడదీయలేని భాగంగా స్పష్టం చేసింది. ఈ ప్రకటనకు ముందు గాజాలో యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ట్రంప్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి. దీనికి నిరాకరిస్తే అమెరికా నుంచి అందే సాయం నిలిపివేస్తామంటూ ట్రంప్ హెచ్చరించారు. ఈ నేపథ్యం లోనే అబ్దుల్లా 2 ట్రంప్‌తో భేటీ అయ్యారు.

# బిసి వర్గాల ప్రజలను మానసిక వేదనకు గురిచేసినందుకు సిఎం బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

**– బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్**

హైదరాబాద్ ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): కాంగ్రెస్ సర్కారు చేసిన కులగణన సర్వే తప్పుల తడక అని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఒప్పుకోవడాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా స్వాగతించారు. అయితే బిసిల జనాభాను తగ్గించి వెనకబడిన వర్గాల ప్రజలను తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకు సిఎం రాష్ట్రంలోని బిసిలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసమగ్రంగా చేసిన సర్వేపై బిఆర్ఎస్‌తోపాటు..బిసి సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం వ్యక్తం చేసినా వినకుండా.. కాంగ్రెస్ అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలన్నారు. రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయడంతోపాటు.. బిసిలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేవలం తూతూమంత్రంగా తీర్మానం చేసి.. బిసి రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుందామంటే మాత్రం బిఆర్ఎస్ తోపాటు..బిసి సంఘాలు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలబెట్టుకునే వరకూ కాంగ్రెస్‌ని రాష్ట్రంలోని బిసిలెవరూ నమ్మే పరిస్థితిలో లేరనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుపెట్టుకుంటే మంచిదని సూచించారు.

# ట్రంప్ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తుంది

**–వైట్‌హౌస్ పూర్వపు అధికారి లిసా కుర్టిస్**

న్యూయార్క్ ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలకు ప్రాధమ్యం ఇస్తున్నదని, ఇండో పసిఫిక్ ప్రాంతాన్ని పటిష్ఠమైనదిగా మార్చేసత్తా ఆ దేశానికి ఉందని, చైనాతో సమర్థంగా పోటీ పడే విషయంలో అది'ముఖ్య భాగస్వామి' అని వైట్‌హౌస్ పూర్వపు అధికారి లిసా కుర్టిస్ చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ గురువారం యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశం నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోడీ వైట్‌హౌస్‌ను సందర్శించడానికి ముందు లిసా కుర్టిస్ ఆ వ్యాఖ్యలు చేశారు. ఆమె అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి ప్రభుత్వంలో 2017, 2021 మధ్య జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సి)లో దక్షిణ, మధ్య ఆసియా విభాగం సీనియర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. మోడీ పర్యటనకు ముందు వాషింగ్టన్ డిసి కేంద్రంగా గల మేధో సంస్థ 'దిసెంటర్ ఫర్ ఎ న్యూ అమెరికన్ సెక్యూరిటీ' (సిఎన్ఎఎస్) నిర్వహించిన ఆన్‌లైన్ పత్రికా గోష్ఠిలో కుర్టిస్ మాట్లాడుతూ, 'విస్పష్టంగా భారత్‌తో సంబంధాలకు ట్రంప్ ప్రభుత్వం ప్రాధమ్యం ఇస్తోంది' అని తెలియజేశారు. 'భారత్ ముఖ్యమైన ప్రపంచ శక్తిగా ఆవిర్భవిస్తుందని వారు గుర్తిస్తున్నారు, ఇండో పసిఫిక్ ప్రాంతంలో, ప్రపంచంలో పరివర్తన తీసుకురాగల సామర్థం నిజంగా ఉంది' అని ఆ మేధో సంస్థలో ఇండో పసిఫిక్ భద్రత కార్యక్రమం సీనియర్ ఫెలో, డైరెక్టర్ కుర్టిస్ పేర్కొన్నారు. యుఎస్ 47వ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం అనంతరం కొన్ని వారాలకు ఆయనతో భేటీ అవుతున్న నాలుగవ విదేశీ అధినేత మోడీ. ట్రంప్ వైట్‌హౌస్‌లో రెండవ విడత బాధ్యతలు చేపట్టిన ఒక నెలలోనే ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, జోర్డాన్ రాజు రెండవ అబ్దుల్లాకు ఆతిథ్యం ఇచ్చారు. 'ట్రంప్ కొత్త ప్రభుత్వం కింద ఇక్కడ దేశీయంగా ప్రతి పరిణామంలో భారత్ పట్ల అటువంటి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండడం గమనార్హం'అని కుర్టిస్ వ్యాఖ్యానించారు. 'అయితే, భారత ప్రభుత్వం కూడా ప్రాతిపదిక ఏర్పరచింది, గురువారం సమావేశం కోసం సకారాత్మక చర్యలు తీసుకొంది' అని ఆమె చెప్పారు. క్వాడ్ కూడా 'ట్రంప్ ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైనది' అని ఆమె పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వ ప్రకటనలు, వాణిజ్యం, టారిఫ్‌లపై దృష్టి కేంద్రీకరిస్తున్న నేపథ్యంలో ట్రంప్ మోడీ భేటీ జరగబోతుండడంతో, 'ఒక వాణిజ్య ఒప్పందానికి వచ్చే ప్రయత్నం చేయడం' ఇద్దరు అధినేతలకు అవసరం అని కుర్టిస్ సూచించారు.

# మంత్రి లోకేష్‌తో కోకాకోలా ప్రతినిధులు భేటీ..



అమరావతి, ఫిబ్రవరి 13:రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తో భేటీ అయ్యారు. బుధవారం ఉండవల్లి నివాసంలో హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రతినిధులు జువాన్ పాబ్లో ,రోడ్రిగ్జ్ ట్రోవాటో వారి బృందం సమావేశమైంది.

ఈ భేటీపై నారా లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించారు.

"ఆంధ్రప్రదేశ్‌లో హెచ్‌సిసిబి పెట్టుబడులు పెడుతుందని తెలిపారు.రాష్ట్రం వ్యాపార అనుకూల వాతావరణం, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రంగా నిలుస్తుందని, దానికి నిదర్శనం కోకా కోలా పెట్టుబడులు" అని పేర్కొన్నారు.

వృద్ధి, ఉపాధి కల్పన, సమాజ అభివృద్ధికి ఆ కంపెనీ నిబద్ధతను తాము స్వాగతిస్తున్నామని లోకేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పురోగతికి దోహదపడే వ్యాపారాలకు తాము మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

# ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాసిస్తోంది

## రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుంది

## – ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రపంచాన్ని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాసిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుందని ఆయన పేర్కొన్నారు. హెల్త్‌లో డేటా కింగ్‌గా కిమ్స్ చైర్మన్ బి. భాస్కర్ రావు తయారవుతారని ఆయన స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 2000 ఏడాదిలో కిమ్స్ తొలి ఆసుపత్రిని తాను ప్రారంభించానని ఆయన గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లలో 5 వేల బెడ్స్‌తో ఐదు రాష్ట్రాలకు కిమ్స్ విస్తరించిందని చెప్పారు. క్రమశిక్షణ తోనే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. సంస్థ బాగుండాలంటే.. అందులో పని చేసే వాళ్లు భాగస్వాములు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. 1995లో తాను ఐటీ గురించి చెప్పానన్నారు. ఇప్పుడు ఏఐ గురించి చెబుతున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతీయులు అద్భుతాలు సృష్టించనున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. జెనిటికల్ పరీక్షలు ద్వారా ఎటువంటి రోగాలు రాబోతున్నాయో కూడా భవిష్యత్తులో తెలియనుందన్నారు. అయితే హెల్త్ కాస్ట్ తగ్గాలని ఆయన పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవలో భాగస్వాములమవుతామన్నారు. నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు.ఇక వాట్సాప్‌లోనే అన్ని సర్టిఫికేట్స్ పొందవచ్చునని చెప్పారు. వివిధ రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేయడానికి ముందుకొచ్చే వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు, సుస్థిరపాలన ఉంటే అభివృద్ధి ఉంటుందన్నారు. 2019లో తెలుగు దేశం పార్టీ గెలిచి ఉంటే ఇంత విధ్వంసం జరిగి ఉండేదా? అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశ్నించారు.ప్రాధాన్యత తెలియని వ్యక్తులు పాలన చేస్తే.. ఎలా ఉంటుందో ఎయిమ్స్‌కి నీళ్లు ఇవ్వలేక పోవడమే అందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేసే దిశగా తాము ఆలోచన చేస్తు?న్నామని చెప్పారు. పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా తాము ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 15 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వివరించారు. రాబోయే బడ్జెట్‌ను అందుకు అనుగుణంగా రూపకల్పన చేస్తు?న్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

# మరోసారి కులగణన .. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడే అవకాశం!

హైదరాబాద్ ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మరోసారి కులగణన జరగనున్న కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉంది. కులగణన సర్వే మళ్లీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో స్థానిక ఎన్నికలు ఆలస్యం కానున్నాయి. స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని డిప్యూటీ సిఎం భట్టి స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్ల పెంపునకు మార్చిలో కేబినెట్ ఆమోదం పొందిన అనంతరం అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం చేయాల్సి ఉంటుంది. మార్చిలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా బిసి బిల్లు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన రిజర్వేషన్లకు చట్టభద్ధత లభించదు.అందుకు పార్లమెంట్‌లో కూడా రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ఆమోదం పొందవలసి ఉంటుంది. అయితే ఇప్పటికే కేంద్ర బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ముగిసే నాటికి పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడతాయి. తిరిగి వర్షాకాల సమావేశాల సందర్భంగానే పార్లమెంట్ సమావేశం కానున్నది. ఆ సమావేశాలు ఆరు నెలల వ్యవధి తర్వాత జులై, సెప్టెంబర్ మధ్యన జరుగనున్నాయి. ఒకవేళ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిసి రిజర్వేషన్ల పెంపు బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించాలంటే అప్పటి దాకా ఆగాల్సిందే.

బిసి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కోసం ఆగాల్సిందే..

బిసి రిజర్వేషన్ల పెంపు అంశం ఇలాంటి అనేక సాంకేతిక సమస్యలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుంటే కేంద్రం నుంచి రావలసిన నిధులు ఆగిపోతాయని తెలిసినప్పటికీ రిజర్వేషన్ల ఆమోదానికి సాంకేతిక కారణాలు ముడిపడి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం అందుకు కూడా సిద్ధపడినట్లు కనిపిస్తోంది. విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకురాగా, ఆయన కూడా ఆ విషయాన్ని ధృవీకరించారు.ప్రజలకు కొంతకాలం పాటు ఆర్థిక నష్టాన్ని కూడా భరించడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కారణాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి ఇప్పటికే ఏడాది పూర్తయినప్పటికీ కనీసం మరో ఆరు నెలలైనా ఆగకతప్పని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఈ మేరకు ప్రతిపాదనలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపింది. దీంతో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఇసి సిద్ధమవుతున్న సమయంలో మళ్లీ కులగణన, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చింది.

# కేజీబీవీలో ఫుడ్ పాయిజన్.. నలుగురు విద్యార్థులకు అస్వస్థత

అమరావతి, ఫిబ్రవరి 13: బ్యూరో :నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఫుడ్ పాయిజన్‌తో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదని చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి పి.జనార్ధన్ రెడ్డి.. సర్వశిక్షా అభియాన్ ఏపీసీ ప్రేమంత కుమార్ విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

# చంద్రబాబువి నీచ రాజకీయాలు: కొట్టు సత్యనారాయణ

అమరావతి ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాజకీయ లబ్ధి కోసమే లడ్డూలో కల్తీ జరిగిందని దుష్ప్రచారం చేశారని వైసిపి నేత, మాజీ దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కొట్టు మీడియాతో మాట్లాడారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను ఎల్లో మీడియా దెబ్బతీసిందని మండిపడ్డారు. చంద్రబాబు ఆరోపణలు నిజం అన్నట్టు సిట్ ఎక్కడా చెప్పలేదన్నారు. సిట్ చెప్పకపోయినా టిటిడి, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కొట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వైఫల్యాలను కప్పిపుచ్చాలనే డైవర్షన్ పాలిటిక్స్ అని విమర్శించారు. నెయ్యిలో కల్తీ జరిగి ఉంటే అడ్డుకునే బలమైన వ్యవస్థ టిటిడిలో ఉందని, చంద్రబాబు తగినశాస్తి అనుభవించక తప్పదని సత్యనారాయణ హెచ్చరించారు.

# వైసిపి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు

హైదరాబాద్ ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ పోలీసుల సహకారంతో ఎపి పోలీసులు ఆయనను రాయదుర్గంలోని మైహోం భుజాలో అరెస్ట్ చేశారు. అనంతరం వంశీని గచ్చిబౌలి నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా విజయవాడకు తరలించారు.

ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసులో వల్లభనేని వంశీని ఎపి పోలీసులు అరెస్టు చేశారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో వంశీ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో వంశీ ముందస్తు బెయిల్ తీసుకున్న విషయం తెలిసిందే. వైసిపి నేతలను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసి చిత్రహింసలు పెడుతోందని వైసిపి నేతలు ఆరోపణలు చేస్తున్నారు. టిడిపి ఆఫీస్ దాడి కేసులో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారని వైసిపి నేతలు ఆరోపణలు చేస్తున్నారు.

# కెసిఆర్ జన్మదిన వేడుకలు.. వృక్షార్చనతో కడియం రైతుల శుభాకాంక్షలు




అమరావతి, ఫిబ్రవరి 13:;తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి రైతుబంధు కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పిలుపు మేరకు వృక్షార్చన లో భాగంగా రాజమహేంద్రవరం లోని కడియం నర్సరీల రైతుల ఆద్వర్యంలో వెయ్యి మొక్కలు నాటి ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రైతు బంధువు, హరిత ప్రేమికుడు అయిన కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కడియం నర్సరీ రైతు పాలూరి నాని ఆధ్వర్యంలో 1000 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం చాలా ఆహ్వానించదగ్గ పరిణామం అని అన్నారు

రైతు బంధువు అయిన కేసిఆర్ పై రైతులు చూపించిన ప్రేమ చాలా అభినందనీయమని ప్రశంసించారు..

ప్రాంతాలుగా విడిపోయిన కూడా ప్రజలుగా కలిసిమెలిసి ఉందామని ఉద్యమ సమయం నుండి కేసీఆర్ చెప్పేవారని ఇప్పుడు అదే విధంగా ఇక్కడి వాతావరణం చూస్తుంటే గుర్తుకు వస్తుందని అన్నారు.

10 సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వం లో హరితహారం కార్యక్రమం ద్వారా పచ్చదనం పెంచడం కోసం 280 కోట్ల మొక్కలను నాటడం జరిగిందని.

దానివల్ల తెలంగాణ వ్యాప్తంగా 8.3% పచ్చదనం పెరిగిందని అన్నారు.

రైతులతో మాట్లాడినప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో హరితహారం కార్యక్రమం ద్వారా ఇక్కడి రైతుల అందరికీ ఎంతో ఉపాధి లభించిందని , తమ నర్సరీల నుండి తెలంగాణ ప్రభుత్వం మొక్కలను కొనుగోలు చేయడం వల్ల మా వ్యాపారం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు.

రైతులు ఎంతో ప్రేమతో మొక్కలు నాటి కేసీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు అని. రైతులందరికీ కేసీఆర్ గారి పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని సంతోష్ గారు అన్నారు.

కడియం రైతు మాధవ్ మాట్లాడుతూ, " కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని మా కడియం రైతులం అందరం కలిసి మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. గతంలో ఆయన నేతృత్వంలో వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరిగింది. పచ్చదనాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్రంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించిడం జరిగింది అని. కరోనా విపత్కర సమయంలో మాకు ఆర్డర్లు ఇచ్చి రైతులను ఆదుకున్నారని అన్నారు

రైతు బంధువు కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని, తిరిగి ఆయన తెలంగాణ రాష్ట్రంకి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాము" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో రైతులు బాలాజీ, ఈల సత్యనారాయణ, శ్రీనివాసరావు, నిమ్మలపూడి త్రిమూర్తులు, హరిత సేవ నాయకులు రాఘవ, కిశోర్ గౌడ్, పూర్ణ చందర్, పాందాల జగన్మోహన్, మురళీకృష్ణ, సతీష్, ఎన్.ఎన్. రాజు, భోజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
విస్తరణ సేవా విభాగం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు
ఆహ్వానం
ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య స్మారకోపన్యాసం
సభాధ్యక్షులు
ఆచార్య వెలుదండ నిత్యానందరావు
ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ముఖ్య అతిథి
డా. కె.వి. రమణాచారి, ఐ.ఎ.ఎస్.(రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వసలహాదారు
ఆత్మీయ అతిథి
శ్రీ డి. లక్ష్మణాచార్యులు
పూర్వ పర్యవేక్షక ఇంజనీర్, రహదారులు మరియు భవనాలశాఖ, తెలంగాణ
స్మారకోపన్యాసకులు
శ్రీ గన్నమరాజు గిరిజా మనోహరబాబు
ప్రముఖ రచయిత
అంశం : సంపత్కుమారాచార్య పద్యవిద్యావైభవం
తేది : 14-02-2025, శుక్రవారం మ. 3 గంటలకు
వేదిక : డా. ఎన్.టి.ఆర్. కళామందిరం,
తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు
ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం
రింగు రామమూర్తి
అసిస్టెంట్ డైరెక్టర్, విస్తరణ సేవా విభాగం
ఆచార్య కోట్ల హనుమంతరావు
రిజిస్ట్రార్

# గిరిజన హాస్టల్‌లో టెన్త్ విద్యార్థి మృతి

**–వికారాబాద్ జిల్లాలో విషాదం**
**–హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా...**
**–సిబ్బందికి దాడికి దిగిన బంధువులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 13:వికారాబాద్ జిల్లాలో విషాదం నెలకొంది. కుల్కచర్ల మండల కేంద్రంలోని గిరిజన బాలుర



వసతీగృహంలో పదో తరగతి విద్యార్థి అనుమానాస్పదంగా మృతిచెందాడు. బుధవారం రాత్రి పడుకున్న విద్యార్థి ఉదయం లేవకపోవడంతో హాస్టల్ సిబ్బంది పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అక్కడ బాలుడిని పరీక్షించిన డాక్టర్లు కొద్ది గంటల ముందే విద్యార్థి చనిపోయినట్టు నిర్ధారించారు.

ఈ విషయం తెలియగానే బాలుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి మృతికి హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. ఈ క్రమంలో హాస్టల్ సిబ్బందిపై కర్రలతో దాడికి యత్నించారు. కాగా, విషయం తెలిసిన పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిన అదుపులోకి తెచ్చారు.

# తుళ్లూరు బ్రహ్మయ్యకు మంత్రి పొంగులేటి జన్మదిన శుభాకాంక్షలు



ఖమ్మం, ఫిబ్రవరి 13 (నేటినిజం ప్రతినిధి) :డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పూల మొక్క ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో బ్రహ్మయ్య మరిన్ని రాజకీయ పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# కెసిఆర్ కృషితోనే జనగామ జిల్లా ఏర్పాటు - ఎమ్మెల్సీ కవిత



జనగామ, ఫిబ్రవరి 13: జనగామ జిల్లా ఏర్పడిందంటే అది మాజీ సీఎం కేసీఆర్ కృషితోనే అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి పాలనలో జనగామ ప్రాంతం అన్యాయానికి గురైందని, ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాతే జిల్లా ఏర్పడడం కాకుండా.. జిల్లా అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. జనగామ జిల్లాలో నేడు పర్యటిస్తున్న కవిత ముందుగా పెంబర్తి గ్రామంలోని విశ్వకర్మ హస్తకళల కేంద్రంను సందర్శించారు. పెంబర్తి గ్రామ్ పంచాయత్ కార్యాలయం వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. పెంబర్తి పర్యటన అనంతరం జనగామ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీ ఉద్యమాలు చేసి.. బీసీలకు న్యాయం చేసే లాగా కేసీఆర్ ప్రభుత్వం అప్పుడు ప్రయత్నం చేసిందన్నారు. ప్రభుత్వం బిల్లులు సక్రమంగా పెట్టి బీసీ బిడ్డలకు లాభం చేసేలాగా, బీసీ బిల్లులు పెట్టేలాగా మనందరం ఐక్యంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

'జనగామ జిల్లా ఏర్పడిందంటే అది కేసీఆర్ కృషితోనే. కేసీఆర్ వచ్చిన తర్వాతే జిల్లా ఏర్పడడం కాకుండా.. అభివృద్ధికి బాటలు పడ్డాయి.

మెడికల్ కాలేజీ, కలెక్టరేట్ ఇలా అన్ని రకాల అభివృద్ధి జరిగిందంటే అది కేసిఆర్ ప్రభుత్వంతోనే. పెంబర్తిలో ఉన్న హస్తకళల సెంటర్ పరిశీలించాను. ఉచిత బస్సు పెట్టారు కానీ.. పెంబర్తిలో బస్సు ఆగుతలేదు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పెంబర్తి గ్రామంలో బస్సులు ఆగాలి' అన్నారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని బీఆర్ఎస్ మాట ఇచ్చింది. బీసీ ఉద్యమాలు చేసి.. బీసీలకు న్యాయం చేసేలాగా కేసీఆర్ ప్రభుత్వం అప్పుడు ప్రయత్నం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ బీసీల గురించి చెబుతుందంటే దాన్ని కారణం తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్ చేసిన ఉద్యమమే కారణం. విద్యలో, ఉద్యోగాల్లో, రాజకీయ రిజర్వేషన్ల కోసం వేరువేరు బీసీ బిల్లులు పెట్టాలి. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మళ్లీ రీసర్వే చేస్తామని చెప్తున్నారు. మీరు ఇచ్చిన మాట ప్రకారం మళ్లీ రీసర్వే చేయండి. హైదరాబాదులో 40 శాతం ఇళ్లలు రాలేదని జనం చెబుతున్నారు. ఎవరైతే మిస్సయ్యారో వాళ్ళందరికి తెలిసే లాగా విస్తృతంగా ప్రచారం చేయండి. ఉపకులాలు చేర్చుకునే లాగా అవకాశం కల్పించండి. బీసీ బిల్లు పెడతామని కాంగ్రెస్ చెప్పడం మన తొలి విజయం మాత్రమే. బిల్లులు సక్రమంగా పెట్టి బీసీ బిడ్డలకు లాభం చేసేలాగా బీసీ బిల్లులు పెట్టేలాగా మనందరం ఐక్యంగా ఉద్యమం చేయాలి' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# ఫేక్ మెడిసిన్స్.... డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలతో వెలుగులోకి...

హైదరాబాద్, ఫిబ్రవరి 13:మూత్ర పిండ వ్యాధులు.. జర్వాన్ని తగ్గిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్న రెండు సంస్థలపై డ్రగ్ కంట్రోల్ అధికారులు కన్నెర్ర చేశారు. మల్కాజ్ గిరి, హనుమకొండల్లోని ఈ సంస్థలపై దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. అలాగే తప్పుడు ప్రచారంతో ప్రజలకు చేరనున్న మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో గండిమైసమ్మ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హేమలత, కిరణ్ కుమార్ పాల్గొన్నారు. హర్యానాలో పంచకుల జిల్లా, సాకేత్రిలో ప్లాట్ నెం.436 లో అల్ట్రా గ్రీన్ (యూనిట్-ఎ), మూత్రపిండ కాలిక్యులి, యురేత్రల్ కాలిక్యులి వ్యాధులకు స్టోన్ నిల్ డీఎస్ సిరప్ పేరిట ఆయుర్వేద మందును ఉత్పత్తి చేస్తోంది. దుండిగల్ సమీపంలోని బౌరంపేటలో మారోవిన్ హెల్త్ కేర్ సంస్థ మార్కెటింగ్ చేస్తున్న విషయాన్ని డ్రగ్ కంట్రోల్ అధికారులు పసిగట్టి దాడులు చేశారు.

మహాసుదర్శన్ కధా పేరుతో ఆయుర్వేద ఔషధాన్నిజ్వరం చికిత్సకు వినియోగిస్తున్నారు. ఈ ఔషధాన్ని బెంగళూరులో పాత మద్రాసు రోడ్డులోని 12వ మైలు రాయి సమీపంలోని ఓం ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ తయారు చేస్తుండగా.. ముంబైలోని 135, నానుభాయ్ దేశాయ్ ఆర్డి., ఖేతవాడి చిరునామా లో శ్రీ ధూతపాపేశ్వర్ లిమిటెడ్ కంపెనీ మార్కెటింగ్ చేస్తోంది. ఈ ఔషధాన్ని హనుమకొండలో డ్రగ్ ఇన్స్పెక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మాట్లాడుతూ.. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం 1954 ప్రకారం ఈ ఔషధాల గురించి అభ్యంతరకర ప్రకటనలు నిషేధం చేసినట్టు తెలిపారు. మూత్రపిండాలు, జ్వరం వ్యాధులు/రుగ్మతలకు సంబంధించిన ప్రకటనల ప్రచురణలో ఏ వ్యక్తి కూడా పాల్గొనకూడదన్నారు. తప్పుదోవ పట్టించే అభ్యంతరకర ప్రకటనలతో మార్కెట్లోకి తరలిస్తున్న మందులను గుర్తించేందుకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేశారు. మల్కజ్ గిరి జిల్లా బౌరంపేట, దుండిగల్, గండిమైసమ్మ ప్రాంతాల్లో స్టోన్ నిల్ డీఎస్ సిరప్‌ను, హనుమకొండలో మహాసుదర్శన్ కదా ఆయుర్వేద ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. మార్కెటింగ్ కంపెనీలపై కేసు నమోదు చేశారు.

# కరాటే వేణుకు మంత్రి పొంగులేటి అభినందన



ఖమ్మం, ఫిబ్రవరి 13 (నేటినిజం ప్రతినిధి) :ఇటీవల హైదరాబాద్ లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజేతగా నిలిచిన ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ వేణును తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం కరాటే వేణుని శాలువతో ఘనంగా సత్కరించారు.

# నేలకొండపల్లి మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మం, ఫిబ్రవరి 13 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేలకొండపల్లి మండలం లో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో ఓ టీ షాప్ ని ప్రారంభించారు. పాలడుగు పూర్ణచందర్ రావు ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. భైరవునిపల్లిలో గొల్ల శ్రీను భార్య చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా చెన్నారంలో చింతనిప్పు సైదులు కుమారుని వివాహం ఇటీవల కాగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

# రైతాంగాన్ని ఆదుకోవాలి

## - రైతులకు రుణమాఫీచేయాలి
## - మిర్చికింటాకు 35000చెల్లించాలి
## - ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలి
## - సిపిఐఎంఎల్ మాస్ లైన్

ఖమ్మం, ఫిబ్రవరి 13 (నేటినిజం ప్రతినిధి) :ఆరుగలం కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక అన్ని రకాల నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు రఘునాథపాలెం మండలం రాంఖ్యా తండాలో రైతులు, పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మిర్చి దిగుబడి రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని పండిన కాసింత పంటను మార్కెట్ కు తీసుకొస్తే సరైన ధర నిర్ణయించకుండా జెండా పాటలు నిర్వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం మార్కెట్ కు రైతులు తీసుకొచ్చిన పంటలను దళారీలు, వ్యాపారులు సిండికేట్ గా మారి రైతన్న అన్ని రకాలుగా నష్టపెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కింటా మిర్చికి 35వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా జెండా పాటని 12వేలకు మించి తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. రైతుల వద్ద నుంచి కమిషన్ కూడా అధికంగా దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో మిర్చి సాగు చేస్తున్న నేపథ్యంలో ఈ జిల్లాకు మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ ద్వారా అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆయన కోరారు. భారత రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని కేంద్రం తీసుకొచ్చిన ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానం కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని దీని స్థానంలో రైతులు వినియోగదారులు ప్రయోజనాలు కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు నిపుణులు రాష్ట్ర ప్రభుత్వాలకు సంప్రదించి తీసుకురావాలని సూచించారు. కేంద్రం తీసుకొస్తున్న కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల హక్కులను ముప్పుగా మారుతుందని ఆయన రెండు లక్షల రుణమాఫీ అనేక వేలాది మంది రైతులకు ఇంకా అమలు కాలేదని దీంతో వారు ఇబ్బంది పడుతున్నారని తక్షణమే రెండు లక్షల వరకు రైతులకు ఉన్న రుణాలను మాఫీ చేసేందుకు ప్రయత్నించాలని కోరారు, ఈ సందర్భంగా అన్నారు. చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ పై దాడి చేసిన ఉన్మాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు 6పథకాల అంశాలపై రీ సర్వే నిర్వహించి ఇందిరమ్మ కమిటీల ప్రమేయాన్ని లేకుండా నిజమైన అర్హులకు ఈ పథకాలు అందించేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పిఓడబ్లు జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, మాస్ లైన్ మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు ధరావత్ లక్ష్మణ్, పాప రావు, వెంకన్న ప్రేమ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



# యార్లగడ్డ వరమ్మకు నివాళులర్పించిన బీపీనాయక్



ఖమ్మం, ఫిబ్రవరి 13 (నేటినిజం ప్రతినిధి) :ఇటీవల ట్రాక్టర్ బోల్తా ప్రమాదంలో మరణించిన యార్లగడ్డ వరమ్మ కర్మ కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ యువ నాయకులు బీపీ నాయక్, ఎమ్మార్వో అనిశెట్టి పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణులతో కలిసి వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి వాతలు.. కుటుంబ సభ్యుల ఆందోళన



కరీంనగర్, ఫిబ్రవరి 13: అంగన్వాడీ కేంద్రానికి చదువు కోసం ఇరుగు కుషి అనే పాపను పంపితే చదువు చెప్పడం మాని పచ్చిబరెకతో వీపుపై వాతలు పడేవిదంగా కొట్టే హక్కు ఎవరిచ్చారు అంటూ బాధితురాలి తాత బండ్ల వెంకటనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తన మనవరాలు స్థానిక గోపాలపురం సెంటర్ 1 నందు చదువుకునేందుకు పంపించగా, ఆ సెంటర్ ఆయా ఖాసింబీ విచక్షణ రహితంగా పసి పాప అని కూడా చూడకుండా పచ్చిబరెకతో కొట్టడంతో ఒల్లంతా వాతలు పడి జర్వం తగిలందని ఆవేదన వ్యక్తం చేశారు.

తన మనవరాలిని కొట్టిన ఆయా సెంటర్ టీచర్లను తక్షణవే తొలగించాలని, లేదంటే సెంటర్ లో చదువుకోవడానికి పిల్లలు రావడానికి భయపడతారని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసలు అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలను దండించి బెత్తంతో కొట్టే హక్కు ఎవరిచ్చారని, ఇటువంటి వారు పిల్లలకు చదువు చెప్పేందుకు పనికి రారని, సంబంధిత శాఖ అధికారులు వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే అంగన్వాడీ సెంటర్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న అంగన్వాడీ సెంటర్ లోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్ధమవుతుందని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలపై దృష్టి సారించాలని కోరారు.

# కెసిఆర్ ఆధ్యక్షతన 19న పార్టీ విస్తృత స్థాయి సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 13:భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 19న పార్టీ అధినేత కె. చంద్రశేఖరరావు అధ్యక్షతన జరగనుంది. తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలోనే విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు.

సమావేశ నిర్వహణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, అనుబంధ విభాగాల ఏర్పాటు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. అంతేకాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలపై కూడా చర్చించే అవకాశం ఉంది.

# మహాకుంభమేళాలో ఫోన్ ఛార్జింగ్ చేస్తే.. గంటకు రూ.1000 వసూలు..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:ప్రయాగ్ రాజ్‌లో కన్నులపండువగా జరుగుతున్న మహాకుంభమేళా దేశవిదేశాల నుంచి భక్తులతో కిక్కిరిసి పోతోంది. నిలబడటానికే జాగా లేనంతగా జనసమూహాలు త్రివేణి సంగమ చుట్టుపట్ల కనబడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అవసరమే. ఈ సందర్భంగా చాలా చోట్ల ఫోన్ ఛార్జింగ్ కోసం అనేక ఏర్పాట్లు చేసింది ప్రభుత్వం. అయినప్పటికీ ఓ వ్యక్తి ఇక్కడికి వచ్చిన వారి ఫోన్లు ఛార్జింగ్ చేస్తూ నెలకు రూ.1000లు సంపాదిస్తున్నా అంటూ వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. అసలు ఇదెలా సాధ్యమని నెటిజన్లు విస్తుపోతున్నారు.

ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమానికి చిత్రవిచిత్రమైన ప్రజలు, సాధువులు వస్తున్నారు. అందుకే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం మొదలైన రోజు నుంచి ప్రత్యేకంగా కనిపించిన ప్రతి విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు వచ్చిన ప్రతి వారి పంట పండినట్లే అని భావించాలి. భక్తులకు బొట్టు పెట్టడం, ఛార్జింగ్, పూసల దండలు ఇలా వివిధ వ్యాపారాలు చేస్తూ పుష్కలంగా డబ్బు సంపాదిస్తున్నారు. ఆ సంఘటనలకు సంబంధించిన అనేక వీడియోలు ఈ మధ్య కాలంలో విపరీతంగా ట్రెండ్ అయ్యాయి.

ఇటీవల కుంభమేళాకు చెందిన వీడియో ఇంటర్నెట్‌లో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఇందులో ఒక వ్యక్తి కుంభమేళాలో ఫోన్లు ఛార్జ్ చేయడం ద్వారా గంటకు రూ. 1,000 సంపాదిస్తున్నట్లు చూపించారు. పోస్ట్ చేసిన కొన్ని రోజుల్లోనే ఈ వీడియోకి మిలియన్ల కొద్దీ వ్యూస్ వచ్చాయి. వీడియో తీస్తున్న వ్యక్తి వారి చూపిస్తూ, 'ఈ అబ్బాయి మహా కుంభ్‌లో గంటకు 1000 రూపాయలు సంపాదిస్తు న్నాడు. అదీ ఎటువంటి ఖర్చు లేకుండా. అతడు ఇక్కడ గంటకు 20 ఫోన్‌లను ఒకేసారి ఛార్జ్ చేసి వారి నుంచి రూ.50 రూపాయలు వసూలు చేస్తాడు. విద్యుత్ ఖర్చుకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే గంటకు కనీసం రూ.1000 రూపాయలు సంపాదిస్తున్నాడు.' అని చెప్తాడు.

ఈ వీడియోపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "మహా కుంభమేళాలో ప్రతి 100 మీటర్ల దూరానికి ఉచిత ఛార్జింగ్ ఉంటుంది." "ఇదంతా అబద్ధం", "అంతా ఉచితం. మోసపోకండి" అంటూ రకరకాలుగా విమర్శిస్తున్నారు.


అందరికీ ఆహ్వానం

JCI Tirupati

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్, తిరుపతి వారి ఆధ్వర్యంలో

ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచన

మీది తెనాలి - మాది తెనాలి

(కొసమెరుపు కామెడీ కథలు)

కథా సంపుటి పుస్తక ఆవిష్కరణ సభ

పుస్తక ఆవిష్కర్త
ఆచార్య జంపాల వెంకట రమణ
ఉపకులపతి, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, తిరుపతి

విశిష్ట అతిథి
శ్రీ పి.రాము
ఎడిటర్, హాస్యానందం మాసపత్రిక, మంగళగిరి

ఆత్మీయ అతిథి
ఆచార్య మూలె విజయలక్ష్మి
భాషావేత్త, తిరుపతి.

సమీక్షకులు
డా॥ చింతకుంట శివారెడ్డి
సహాయ పరిశోధకులు
సి పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప

తేది : 16-02-2025 ఆదివారం సాయంత్రం 4.00 గంటలకు
వేదిక : ఛాంబర్ ఆఫ్ కామర్స్, హథీరాంజీ కాలనీ, తిరుపతి.
సెల్ : 93936 62821

అధ్యక్షులు: జె.సి.ఆర్.శేషసాయి
కార్యదర్శి: జె.సి.వి.దిలీప్ కుమార్
కోశాధికారి: జె.సి.ఎన్.దిలీప్‌కుమార్ రెడ్డి


# ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా.. ఎర్రబెల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 13:ఓటమి భయంతోనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ముఖ్యనేత ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించేందుకు చూస్తున్నారని మరోసారి ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన పాలకుర్తిలో మీడియాతో మాట్లాడుతూ.. అధికార పార్టీలో 25 మంది ఎమ్మెల్యేలు ఒక్కటయ్యారని కామెంట్ చేశారు.

15నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని.. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని బాంబు పేల్చారు. పథకాల పేర్లు మార్చి ఎంతో అభివృద్ధి చేసినట్లుగా కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యేలకు సమన్వయం కొరవడిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఎర్రబెల్లి దయాకర్ రావు ఫైర్ అయ్యారు.

# అనుచిత పోస్టులు పెడితే చర్యలు తప్పవు : ఏసీపీ రహెమాన్

వరంగల్, ఫిబ్రవరి 13:సామాజిక మాధ్యమాల ద్వారా విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏసీపీ రహెమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ, కుల, మత, ప్రాంతీయ వివాదాలకు తావు ఇచ్చేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

Whats App, Facebook, Twitter, Instagram వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించే విధంగా, ఏదైనా వర్గాన్ని కించపరిచేలా తెలియని సమాచారాన్ని పోస్ట్ చేయడం, షేర్ చేయడం నేరంగా పరిగణించబడుతుందన్నారు. ఒక గ్రూపులో ఇలాంటి పోస్టులు షేర్ అయితే, ఆ గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడిగా పరిగణించబడతారని తెలిపారు.

ఇలాంటి చర్యలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. అనుచిత పోస్టులను ఫార్వర్డ్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. కాబట్టి సామాజిక మాధ్యమాలను సమాజానికి మంచిని చేకూర్చేవిధంగా మాత్రమే ఉపయోగించుకోవాలని, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని సూచించారు

# లంచాలకు తావు లేకుండా పరిపాలన సాగించాం : వైసిపి అధినేత జగన్

అమరావతి ఫిబ్రవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా వైఎస్ఆర్పి పాలన చేసిందని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. 20019-2024 మధ్య 1.0 ప్రభుత్వం నడిచిందని ఆయన తెలియజేశారు. లంచాలకు తావు లేకుండా రూ. 2.71 లక్షల కోట్లు డిబిటి చేశామని స్పష్టం చేశారు. కోవిడ్ వల్ల ఆదాయం తగ్గినా హామీలు అమలు చేశామని, ప్రజా జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశామని, మనం చేసిన అభివృద్ధి ప్రజల కళ్లముందే ఉందన్నారు. ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టారని, మేనిఫెస్టోను చెత్తబుట్టలోకి విసిరేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరోగమనంలో విద్య, వైద్యం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు మన హయాంలో ఇచ్చిన ప్రతి పథకాన్నీ రద్దు చేశారని మండిపడ్డారు.

